సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం : 24 : జనవరి : 2023



చేసిన పనులకు బిల్లులు వస్తలేవ్

అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నరు. చేసిన పనులకు బిల్లులు వస్తలేవని సర్పంచ్‌లు వాపోయారు. - 9లో



దేశం గర్వించదగ్గ త్యాగశీలి

సుభాష్ చంద్రబోస్ దేశం గర్వించదగ్గ త్యాగశీలి అని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
30.0°/17°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై మధ్యాహ్నం ఆహ్లాదకరంగా, రాత్రిపూట చలి మోస్తారుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కంటి వెలుగు శిబిరం తనిఖీ

భువనగిరి : మండలంలోని నందనం గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం కంటి వెలుగు రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ స్వప్న తనిఖీ చేశారు. కంటి పరీక్షల నిర్వహణ, కళ్లద్దాల పంపిణీ వివరాలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. శిబిరం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ యామిని, కాంచన, సూపర్‌వైజర్లు ప్రపుల్ల, సాయి ప్రసన్న, సురేష్, వినోద్, సబిత, సునందా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రుడికి విశేష పూజలు



మహా శివుడికి పూజలు చేస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం ఆచార్యులు విశేష పూజలు నిర్వహించారు. తొలుత హోమ మండపంలో అగ్ని ప్రతిష్ఠ, రుద్రహవనం, అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు చేశారు. గర్భాలయంలో, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతి ఇచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడికి నిత్య కైంకర్యాలు చేపట్టారు.

సీఎస్‌ను కలిసిన నిర్వాసితులు



సమస్యలు వివరిస్తున్న నిర్వాసితులు

భువనగిరి : బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులు భువనగిరి పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, ఎంపీటీసీ ఉడుత శారద అంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని హైదరాబాద్‌లోని ఆమె చాంబర్‌లో కలిశారు. పాత అవార్డును తొలగించి కొత్త అవార్డును ప్రకటించాలని, పునరావాస కేంద్రంలో త్వరగా ప్లాట్లు కేటాయించి ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వల్లందాస్ పరమేష్ కుమార్, వలబోజు నరసింహాచారి, ఓంకార్‌చారి, సిద్ధాచారి, డోంకెల రాజేష్, ఎండీ బాబా, నకరికంటి సుధాకర్ పాల్గొన్నారు.

బంగారు యజ్ఞోపవీతం బహూకరణ



యజ్ఞోపవీతాన్ని అందజేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట : పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామికి సికింద్రాబాద్‌కు చెందిన కొత్తపల్లి రమేష్‌కుమార్ బంగారు యజ్ఞోపవీతాన్ని అందజేశారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల చెంత యజ్ఞోపవీతాన్ని ఆలయ అర్చకులు, అధికారులకు అందజేశారు.

బీఆర్‌ఎస్ పార్టీతోనే ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



ట్యాంకును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్

బొమ్మలరామారం : బీఆర్‌ఎస్‌తోనే ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి అన్నారు. మండలంలోని ప్యారారంలో మిషన్ భగీరథ ట్యాంకును సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో వ్యవహరించడం వల్లే మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ సరిత, ఎంపీఓ మాళిని, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లక్ష్మణ్‌నాయక్, ఏఈ మాధవి, వైస్ ఎంపీపీ శోభ చంద్రమౌళి, పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్ నర్సింహ, మండల పార్టీ అధ్యక్షుడు పోలగోని వెంకటేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, సర్పంచ్‌లు రవీందర్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు మహేందర్‌రెడ్డి, గుండ్లపల్లి వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో ఇంటర్వ్యూకు హాజరైన మైనార్టీ అభ్యర్థులు

4 యూనిట్లు.. 300 దరఖాస్తులు

భువనగిరిటౌన్ : మైనార్టీ కార్పొరేషన్ రుణాల మంజూరీ కోసం సోమవారం నిర్వహించిన ఇంటర్వ్యూకు భువనగిరి మున్సిపాలిటీలో అభ్యర్థులు పోటెత్తారు. నాలుగు యూనిట్‌లకు గాను 300 మంది హాజరయ్యారు. మైనార్టీ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందడానికి ప్రభుత్వం గత నెల మైనార్టీ కార్పొరేషన్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లాకు 30 యూనిట్లు కేటాయించింది. రూ. లక్ష, రూ.2లక్షల రుణాలు ఉన్నాయి. ఇందులో భువనగిరి మున్సిపాలిటీకి నాలుగు యూనిట్‌లు కేటాయించగా 300 మంది దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే బ్యాంకు అధికారులు మధ్యాహ్నం వరకు రాకపోవడంతో అభ్యర్థులు ఇబ్బందిపడ్డారు. చివరికి బ్యాంక్‌ల ఫీల్డ్ ఆఫీసర్లు వచ్చి సర్టిఫికెట్‌ల పరిశీలన చేశారు.



కార్యాలయం బయట నిరీక్షిస్తున్న అభ్యర్థులు

ఆడపిల్లకు అండగా..

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న జిల్లా యంత్రాంగం

- విజయవంతంగా పథకాల అమలు
- హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన
- విద్య, ఉద్యోగావకాశాలకు చేయూత
- చైతన్యం తెస్తున్న 'స్నేహిత'
- నేడు జాతీయ బాలికా దినోత్సవం



సాక్షి, యాదాద్రి : సృష్టికి మూలం ఆమె. అమ్మ, అక్క, చెల్లి, భార్య.. ఇలా ఎన్నో పాత్రల్లో ఒదిగిపోయే గొప్ప శక్తి. కుటుంబ జీవితానికి ఆధారం. ఆమె లేకుంటే మనం లేం. ఇవన్నీ తెలిసినా మనిషి ఆడపిల్లను భారంగా భావిస్తున్నాడు. ఆడపిల్ల పట్ల చిన్న చూపు, ఆంక్షలు, వివక్షను అడ్డుకోవడం, భ్రూణ హత్యలను నివారించేందుకు భారత ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్' పేరుతో 2008 నుంచి ఏటా జనవరి 24వ తేదీన జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తోంది. నేడు బాలికా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

అన్నింటా ప్రగతి

బాలికల ఉన్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. హక్కుల సాధన, రక్షణ కోసం అనేక చట్టాలు అమలు చేస్తున్నాయి. ఫలితంగా నేడు బాలికలు ఉన్నత విద్యలోనే కాదు.. ఉద్యోగాల్లోనూ రాణిస్తున్నారు. వీటికి తోడు అపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్, షీటీంల పనితీరు, సఖి కేంద్రాల ద్వారా అవగాహన.. సత్ఫలితాలనిస్తున్నాయి. శిశు సంరక్షణ, లింగ నిర్ధారణ పరీక్షలపైనా కఠినంగా వ్యవహరిస్తుండడంతో బాలికల నిష్పత్తి క్రమంగా పెరుగుతోంది. జిల్లాలో 1000 మంది పురుషులకు 988 మంది మహిళలు ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో 970, పల్లెల్లో 973 మందిగా నమోదైంది.

కేజీబీవీల్లోనూ..

జిల్లాలోని మూడు కేజీబీవీల్లో 300 మంది బాలికలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా లైఫ్ స్కిల్స్, స్వీయ రక్షణ, మార్షల్ ఆర్ట్స్, వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమాలు చేపట్టారు.

'స్నేహిత'తో చైతన్యం

బాలికల ఉన్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలకు తోడు కలెక్టర్ పమేలా సత్పతి రాష్ట్రంలోనే జిల్లాలో స్నేహిత పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందు కోసం వైద్యారోగ్య, ఐసీడీఎస్, విద్య, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల సిబ్బందితో 26 బృందాలను ఏర్పాటు చేశారు. గత ఏడాది జూలై 14నుంచి అక్టోబర్ మాసం వరకు 271 పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 43 వేల మంది విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. చట్టాలు, చదువు, భ్రూణహత్యల నివారణ, బాల్య వివాహాల వల్ల తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటు ధైర్యం, ప్రేరణ కల్పించారు. వీటితో పాటు మానవ అక్రమ రవాణా, పోక్సో యాక్ట్, బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లైఫ్ స్కిల్స్, బాలికల రక్షణ, సమానత్వం, నవ యవ్వన వయస్సు బాలికలకు ఆరోగ్య చిట్కాలు, ఆత్మరక్షణ, యాక్షన్‌ప్లాన్, చైల్డ్ హెల్ప్‌లైన్ –1098, పోలీస్ హెల్ప్ లైన్–100పై స్నేహిత ద్వారా వివరించారు.

నేటి నుంచి రెండో విడత 'స్నేహిత'

తొలి విడత స్ఫూర్తితో ఈనెల 24,27,28,29 తేదీల్లో రెండో విడత స్నేహిత కార్యక్రమం నిర్వహించనున్నారు. దీంట్లో భాగంగా 221 పాఠశాలల్లో 1నుంచి 5వ తరగతి చదవే 17 వేల మంది బాలికలకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం 38 టీంలను ఏర్పాటు చేశారు. ప్రతి టీంలో ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లు, ఒక సూపర్‌వైజర్ ఉంటారు. మండల ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో స్థానిక ప్రజాప్రతినిధులను మమేకం చేసి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విద్యనే బలమైన ఆయుధం



బాలికలకు విద్యనే అత్యంత బలమైన ఆయుధం. స్వయంశక్తితో ధైర్యంగా ముందుకెళ్తే సాధించలేనిది ఏమీ ఉండదు. ఆశ కార్యకర్త వంటి చిన్న ఉద్యోగం నుంచి రాష్ట్రపతి వరకు మహిళలు రాణిస్తున్నారు. సమస్యలను అధిగమించి ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి. బాలబాలికలు ఇద్దరూ సమానమే అన్న భావన తల్లిదండ్రులు కలిగిఉండాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న శుక్రవారం సభలకు వస్తున్న తల్లుల్లో ఎంతో మార్పు కనిపిస్తోంది. వారి ఆశలు, ఆశయాలు, ఆపోహలు, సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. అమ్మాయిలను చదివించాలన్న తాపత్రం తల్లుల్లో పెరిగింది. లైంగిక వేధింపులు, అబార్షన్లు, భ్రూణహత్యలను అడ్డుకోవాలన్న ఆలోచన పెరిగింది. స్నేహిత కార్యక్రమం ద్వారా బాలికలకు అనేక విషయాలపై అవగాహన కల్పించి చైతన్యం తెచ్చాం. 16 మంది బాలికలు తమపై లైంగిక దాడులు జరిగాయని ధైర్యంగా చెప్పారు. ఇందులో 3వ తరగతి విద్యార్థులు ఉండడం స్నేహిత కార్యక్రమం సత్ఫలితానికి నిదర్శనం. వారికి అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సాహస బాలికల అవార్డు ఇస్తున్నాం. గతంలో దసరా సెలవుల్లో బాలికలకు వివాహాలు ఎక్కువగా జరిగేవి. బాలవివాహాలపై తలెత్తే అనార్థలపై తల్లిదండ్రులతో పాటు బాలబాలికలకు అవగాహన కల్పించడంతో డ్రాపౌట్స్ తగ్గాయి. 2018 నుంచి 83 బాల్య వివాహాలను అడ్డుకున్నాం.

- పమేలా సత్పతి, కలెక్టర్

మీరైనా మా గోడు వినండి



కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతులు అందజేయడానికి బారులుదీరిన బాధితులు

- ప్రజావాణిలో కలెక్టర్‌కు బాధితుల మొర

భువనగిరిటౌన్ : మండల స్థాయిలో అధికారులకు సమస్యలు విన్నవించినా పరిష్కారం లభించడం లేదు.. జిల్లా అధికారులైనా తమ గోడు విని పరిష్కరించాలని ప్రజావాణిలో పలువురు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు అర్జీలు అందజేశారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారులు మళ్లీమళ్లీ కార్యాలయానికి రాకుండా సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఇదిలా ఉండగా వివిధ సమస్యలపై 39 వినతులు అందాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 29 వినతులు ఉన్నాయి.

వినతుల్లో కొన్ని..

- ఆలేరులోని మమత నర్సింగ్‌హోం, భువనగిరిలోని స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని ఆలేరుకు పట్టణానికి చెందిన పల్లె రంజిత్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తన భార్య కాన్పుకు నెలలు నిండడంతో తొమ్మిదో నెల మొదటి వారంలో ఆలేరులోని మమత నర్సింగ్‌హోంకు తీసుకెళ్లగా పరిశీలించిన డాక్టర్.. మరో 15 రోజులు సమయం పెంచిందన్నారు. 15 రోజుల తర్వాత వెళ్లగా స్కానింగ్ తీయించాలని చెప్పడంతో భువనగిరిలోని స్కానింగ్ సెంటర్ వెళ్లినట్లు పేర్కొన్నారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు తమను సుమారు 6 గంటల వరకు అక్కడే ఉంచుకున్నారని చెప్పారు. అప్పటికే శిశువు మృతి చెందిందని, ప్రమాదం గమనించిన స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు తమకు విషయం చెప్పలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. వైద్యులు కూడా చెప్పకుండా డెలివరీ చేశారని ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన నర్సింగ్‌హోం, స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.
- కొయ్యలగూడెం నుంచి జాతీయ రహదారి వరకు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలని కోరుతూ గ్రామ ఎంపీటీసీ జెల్ల ఈశ్వరమ్మవెంకటేశం వినతపత్రం అందజేశారు.డ్రెయినేజీ లేకపోవడంతో ఇళ్లలో వాడిన నీరు, వర్షపు నీరు అంతర్గత రోడ్లపై పారుతుందన్నారు.
- గోవులను అమ్మకుండా, మాంసం విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వలిగొండ మండలం పులిగిల్ల గ్రామస్తులు అర్జీ అందజేశారు.



భూదాన్‌పోచంపల్లిలోని నేతాజీ చౌరస్తాలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేతాజీ కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఆ సంఘం నాయకులు

నేతాజీ ఆశయాలు స్ఫూర్తిదాయకం

భూదాన్‌పోచంపల్లి : నేతాజీ ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని నేతాజీ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు తడక వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారుడు సార బాలయ్యగౌడ్, సంఘం అధ్యక్షుడు వంగూరి కృష్ణ అన్నారు. భూదాన్‌పోచంపల్లిలోని నేతాజీ చౌరస్తాలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేతాజీ కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేతాజీ స్ఫూర్తితో ఆయన పేరిట సంఘం ఏర్పాటు చేసి 55 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు గ్రామాభివృద్ధిలో పాలు పంచుకోవడం అభినందనీయమని కొనియాడారు. పర్యాటక కేంద్రమైన పోచంపల్లిలో నేతాజీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అందరికీ గర్వకారణమన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు తడక రమేష్, నేతాజీ సంఘం ప్రధాన కార్యదర్శి గునిగంటి రమేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు బొడిగె లింగం, మక్తాల వెంకటేశం, తడక గౌరీశంకర్, డబ్బీకార్ సాహేశ్, శెట్టి శ్రీనివాస్, వంగూరి రాజు, కట్కూరి పాండు, జి. సుభాస్, గునిగంటి వంకటేశ్, పండగ ప్రభు, కీర్తి సంజీవ, నాగేశ్వర్, మస్నం ప్రసాద్, రాంనర్సింహ, వంగూరి పాండు, శ్రీను, నవీన్, సుధాకర్,నాగరాజు, గిరి, భాస్కర్, కొండ శివ, శంకర్, సాయికుమార్, ధీరజ్, విజయ్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి 'పీఎం శ్రీ'

- జిల్లాలో 102 పాఠశాలలు అర్హత
- వీటిలో 34 స్కూళ్లను ఫైనల్ చేయనున్న అధికారులు
- నెలాఖరులో తనిఖీలకు రానున్న రాష్ట్ర బృందాలు
- ఎంపికైన వాటికి ప్రతి సంవత్సరం రూ.40 లక్షలు కేటాయింపు
- వసతుల కల్పన, వినూత్న బోధనకు ఖర్చు



చల్లూరు పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా బృందం

అర్హత సాధించిన పాఠశాలలు

అడ్డగూడూరు	03	మోటకొండూరు	02
ఆలేరు	05	మోత్కూరు	03
ఆత్మకూర్(ఎం)	03	నారాయణపురం	07
భువనగిరి	12	పోచంపల్లి	12
బీబీనగర్	09	రాజాపేట	05
బొమ్మలరామారం	05	రామన్నపేట	05
చౌటుప్పల్	08	వలిగొండ	04
గుండాల	06	యాదగిరిగుట్ట	09
తుర్కపల్లి	04		

భువనగిరి : పాఠశాలల్లో విద్యా ప్రమాణాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు గాను నిధులను సంబంధిత పాఠశాలల కమిటీలకు నేరుగా అందజేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం అమలు చేస్తుంది. నూతన జాతీయ విద్యావిధానంలోని అంశాలకు అనుగుణంగా పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఆధునీకరణ, వినూత్న బోధన, అధునిక సాంకేతిక పరిజ్ఞానం, కీలక నైపుణ్యాలతో ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా నిర్దేశించారు. యూడైస్ గణాంకాలను పరిగణలోకి తీసుకుని నిర్దేశించిన కనీస ప్రమాణాల ఆధారంగా జిల్లాలో 145 పాఠశాలలను ప్రతిపాదించారు. ప్రతిపాదిత పాఠశాలల్లో వివిధ సౌకర్యాలకు సంబంధించిన సమగ్ర వివరాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నమోదు చేశారు. ఆ తర్వాత ప్రత్యేక టీంలు తనిఖీ చేశాయి.

17 బృందాలతో తనిఖీ

జిల్లాలో 712 పాఠశాలలు ఉండగా పీఎం శ్రీ పథకానికి 145 పాఠశాలలను ప్రతిపాదించారు. ఆయా పాఠశాలల్లో సౌకర్యాలను తనిఖీ చేసి నివేదిక ఇచ్చేందుకు జిల్లా విద్యావాఖ 17 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసింది. ఈ బృందాల్లో గెజిటెడ్ హెచ్‌ఎంలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందాలు 145 పాఠశాలలను తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చిన విధంగా వివరాలు ఉన్నాయా లేదా పరిశీలించగా 102 పాఠశాలలు అర్హత పొందాయి. అర్హత పొందిన స్కూళ్ల వివరాలను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు. వీటిలో రాష్ట్ర బృందాలు ఈ నెలాఖరులో తనిఖీలు చేయనున్నాయి.

మండలానికి రెండు చొప్పున ఎంపిక

అర్హత సాధించిన 102 పాఠశాలల వివరాలను రాష్ట్ర విద్యాశాఖకు పంపించారు. రాష్ట్ర బృందాలు వాటిలో తనిఖీలు నిర్వహించి మండలానికి ఒక ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక లేదా ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపిక చేస్తారు. ఈ లెక్కన జిల్లాలోని 17 మండలాల్లో 34 పాఠశాలలు ఎంపిక కానున్నాయి. ఎంపికైన పాఠశాలల అభివృద్ధికోసం ఏటా రూ.40 లక్షల చొప్పున ఐదేళ్ల పాటు నిధులు రానున్నాయి.

పాఠశాలల అభివృద్ధికి దోహదం



రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా మొదటి విడత కింద జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయి. పీఎం శ్రీ పథకం ద్వారా ఎంపిక కానున్న పాఠశాలలు కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. తనిఖీలకు త్వరలో రాష్ట్ర బృందాలు రానున్నాయి. అనంతరం ప్రక్రియ పూర్తి కానుంది.

– కె.నారాయణరెడ్డి, డీఈఓ

రెవెన్యూ శాఖ తల్లిలాంటిది

- కలెక్టర్ పమేలా సత్పతి
- రెవెన్యూ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

సాక్షి, యాదాద్రి : అన్ని ప్రభుత్వ శాఖలకు రెవెన్యూ తల్లిలాంటిదని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఇలా.. ప్రతి పనిలో రెవెన్యూ శాఖ కీలకమన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం, భూ సర్వే, ప్రభుత్వం భూములు, చెరువు శిఖాలను కాపాడడంతో రెవెన్యూ శాఖ పాత్ర అద్వితీయమన్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగుల కృషి మరువలేనిదన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ పల్లెప్రగతి, పట్టణప్రగతిలో భాగంగా చేపట్టిన వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం తదితర పనుల్లో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. అంతేకాకుండా జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో రెవెన్యూ యంత్రాంగం జిల్లా ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అన్ని రంగాల్లో జిల్లాను ప్రగతిపథంలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు ఎంవీ భూపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి, జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు మందడి ఉపేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఉద్యోగులు సంఘం నాయకులు బాణాల రాంరెడ్డి, కొప్పుల వెంకటరెడ్డి, అంజనేయులు, నాగేశ్వరాచారి, సుధాకర్ రావు, వెంకటరెడ్డి, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ భూపాల్‌రెడ్డి, డీఆర్‌డీఓ ఉపేందర్‌రెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు

క్లుప్తంగా

వ్యవసాయ మోటారు చోరీ



చోరీ జరిగిన మోటారు పైపును పరిశీలిస్తున్న రైతులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని రామలక్ష్మీపురం శివారులో గల కాల్వలు, బావుల వద్ద వ్యవసాయ మోటార్లను దుండగులు చోరీ చేస్తూ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఇప్పటికే గ్రామ పరిధిలోని నలుగురు రైతుల మోటార్లను చోరీ చేసిన దుండగులు, ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు గణపవరం మేజర్ కాల్వపై ఏర్పాటు చేసిన మోటారులోని విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. వ్యవసాయ మోటార్ల చోరీకి పాల్పడుతున్న నిందితులను పోలీసులు గుర్తించి రైతులు ఇబ్బందులు లేకుండా చూడాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి కోరారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి



శ్రీనాథ్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ టైరు కింద పడి డ్రైవర్ మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని పెద్దరావులపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలంలోని కప్రాయిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మన్నె శ్రీనాథ్(21) ఆదివారం రాత్రి పెద్దరావులపల్లిలో పొలం పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో పెద్దరావులపల్లి గ్రామశివారులోకి రాగానే ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రాయిని ఢీకొట్టడంతో శ్రీనాథ్ ఎగిరి ట్రాక్టర్ ఇంజన్ టైరు కింద పడిపోయాడు. ఈ క్రమంలో టైరు అతడి తలపైనుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సోమవారం ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు. కిష్టయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరిలో శ్రీనాథ్ చిన్న కుమారుడు. చేతికి అందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడటంతో ఆ కుటుంబంలో పెనువిషాదం నెలకొంది.

జాన్‌పహాడ్ ఉర్సును వారసులే నిర్వహించాలి

- తీర్పు వెలువరించిన హైకోర్టు



హైకోర్టు తీర్పు కాపీలను చూపుతున్న ఉర్సు చీఫ్ కోఆర్డినేటర్ అబ్దుల్ లతీఫ్, హక్కుదారులు

సూర్యాపేట: పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్‌లో గల హజ్రత్ జాన్ పాక్ షహీద్ (రెహమతుల్లా అలే) దర్గా ఉర్సును రెహమతుల్లా అలే వారసులే నిర్వహించుకోవాల్సిందిగా హైకోర్టు తీర్పు వెలువరించినట్లు ఉర్సు చీఫ్ కోఆర్డినేటర్ మహమ్మద్ అబ్దుల్ లతీఫ్, హక్కుదారు మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. కొంతకాలంగా జాన్‌పహాడ్‌కు చెందిన మోహినుద్దీన్ కుటుంబ సభ్యుడు సయ్యద్ జానీ దర్గా వద్ద ముజావర్‌గా కొనసాగుతూ అధికారులు, వక్ఫ్ బోర్డును తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. మోహినుద్దీన్ కుటుంబ సభ్యులు ముజావర్‌గా కొనసాగడంపై తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన డబ్ల్యూపీ నంబర్ 27712/2014, 24198/2015 పిటిషన్లను విచారించిన హైకోర్టు మోహినుద్దీన్ కుటుంబ సభ్యులకు దర్గాకు సంబంధించి ఎలాంటి హక్కులు లేవని తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. పాలకవీడుకు చెందిన రెహమతుల్లా అలే వారసులు మహమ్మద్ అహ్మద్ హుస్సేన్, మహమ్మద్ ఇమాముద్దీన్, మహమ్మద్ గులాం రసూల్, మహమ్మద్ హనాన్, మహమ్మద్ హుస్సేన్, మహమ్మద్ సలార్, మహమ్మద్ గౌస్ దర్గా హక్కుదారులని హైకోర్టు తెలిపిందన్నారు. అనంతరం దర్గా హక్కుదారుడు మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించే దర్గా ఉర్సుకు రావాల్సిందిగా మంత్రి జగదీశ్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, నల్లమోతు భాస్కరరావు, బొల్లం మల్లయ్యయాదవ్, సూర్యాపేట కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. సమావేశంలో హక్కుదారులు గులామ్ రసూల్, మహమ్మద్ హనాన్, మహమ్మద్ సాలార్ ఖాద్రీ, మహమ్మద్ గౌస్ బాబు, మాజీద్, రియాజ్ పాల్గొన్నారు.

ఏప్రిల్ వరకు అంధుల పాఠశాల కొనసాగింపు



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ నర్సింహ

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలో డ్వాబ్ సంస్థచే నిర్వహించబడుతున్న అంధుల పాఠశాలను ఈ ఏడాది ఏప్రిల్ వరకు కొనసాగించనున్నట్లు డ్వాబ్ సంస్థ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు అధికారులకు తెలియజేశారు. అంధుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సోమవారం నల్లగొండ ఎంఈఓ నర్సింహ, సీడీపీఓ నిర్మల వచ్చి పాఠశాలను పరిశీలించారు. సంక్రాంతి సెలవుల అనంతరం ఈ నెల 18 నుంచి పాఠశాలను ప్రారంభించడం జరిగిందని పాఠశాల నిర్వాహకులు అధికారులకు వివరించారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు పాఠశాల నిర్వహిస్తామని, ఈ విద్యా సంవత్సరం పూర్తి అయ్యే వరకు విద్యార్థులకు విద్య అందించడం జరుగుతుందని తెలియజేశారు. బడి మూసివేసినా అంధులకు కంప్యూటర్ శిక్షణ, అంధ వృద్ధుల సమస్యల పరిష్కారం కోసం డ్వాబ్ సంస్థ యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



సాయిసింగ్ (ఫైల్)

చౌటుప్పల్ : మండల పరిధిలోని తూప్రాన్‌పేట గ్రామ శివారులో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన బొందుల సాయిసింగ్(39) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన కుమారుడు ఆకాష్‌సింగ్‌ను తీసుకొని ఈ నెల 19న దైవ దర్శనం నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. దర్శనం అనంతరం 21న ట్రైన్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో నల్లగొండ రైల్వే స్టేషన్‌లో ఆకాష్‌సింగ్ అదృశ్యమయ్యాడు. కుమారుడిని వెతుక్కుంటూ ఆదివారం తూప్రాన్‌పేట గ్రామానికి చేరుకున్న సాయిసింగ్‌ను గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. సోమవారం మృతుడి సోదరి ఠాకూర్ శిరీష ఫిర్యాదు మేరకు ఎస్సై సీత పాండు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా తప్పిపోయిన మృతుడి కుమారుడు ఆకాష్‌సింగ్ ఆదివారం సంస్థాన్ నారాయణపురం పోలీసులకు దొరికాడు. పోలీసులు అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వృద్ధుడు మృతి




లింగయ్య మృతదేహం

కేతేపల్లి: గుర్తుతెలియని కారు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని చీకటిగూడెం గ్రామ శివారులో జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన కుమ్మరి లింగయ్య(65) చీకటిగూడెం గ్రామ శివారులో జాతీయ రహదారి వెంట ఉన్న లిటిల్ విలేజ్ హోటల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా సోమవారం లింగయ్య హోటల్‌లో విధులకు హాజరయ్యేందుకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైవే దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన లింగయ్యను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ఆగకుండా పరారయ్యాడు. మృతుడి కుమారుడు జానయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న నెలవంక

యాదగిరిగుట్ట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపై నెలవంక సోమవారం రాత్రి కనువిందు చేసింది. శ్రీస్వామి వారి ప్రధానాలయ సుదర్శన చక్రానికి నెలవంక తాకినట్లు కనిపించింది. సుదర్శన చక్రానికి నెలవంక పెట్టినట్లు అద్భుతంగా కనిపించడంతో చాలా మంది భక్తులు సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు.



సుదర్శన చక్రానికి తాకినట్లుగా కనిపిస్తున్న నెలవంక

మార్కండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి తదితరులు



ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కేరళ వాయిద్య బృందం

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని శ్రీమార్కండేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామివారిని గుర్రపు బగ్గిపై ప్రతిష్ఠించి కేరళ నాదస్వర, మృదంగ బృందం, మహిళల కోలాటాల నడుమ పురవీధుల గుండా నూలు దండల ఊరేగింపు నిర్వహించి స్వామివారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ బడుగు చండీకేశ్వర్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, చేనేత సంఘం రాష్ట్ర నాయకులు తడక వెంకటేశం, తడక రమేశ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యనారాయణ, మహాజన సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్నాటి పాండు, అంకం మురళి, కౌన్సిలర్లు గుండు మధు, భోగ భానుమతివిష్ణు, రుద్ర శ్రీశైలం, సూరెపల్లి రమేశ్, భోగ స్వామి, ధర్మకర్తల మండలి ఉపాధ్యక్షుడు భోగ చంద్రశేఖర్, కార్యదర్శి రుద్ర బాలరాజు, కోశాధికారి రాజారమేశ్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న సూర్యాపేట జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీధర్

గరిడేపల్లి: పట్టు పరిశ్రమతో ప్రతి నెలా అధిక ఆదాయం పొందవచ్చునని సూర్యాపేట జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి శ్రీధర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో పట్టు రైతులకు నైపుణ్య శిక్షణ తరగతులను కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీధర్ హాజరై మాట్లాడారు. ప్రత్యామ్నాయ పంటగా మల్బరీ సాగు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. పట్టు ఉత్పత్తి, మార్కెటింగ్ అంశాలపై జిల్లాలో ఎంపిక చేసిన రైతులకు కేవీకే ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రోగ్రాం కోఆర్డినేటర్ లవకుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పట్టు పురుగుల పెంపకం చేపట్టిన రైతులతో పాటు సెరికల్చర్‌పై ఆసక్తి గల వారికి ములుగు జిల్లాలోని కేంద్రీయ పట్టు పరిశోధనా కేంద్రం రీజనల్ రీసెర్చ్ సెంటర్ ఆర్థిక సహకారంతో మూడు రోజుల పాటు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు నరేష్, సుగంధి, నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



రెహమాన్ బాబాకు సెల్‌ఫోన్ అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

నల్లగొండ క్రైం: పట్టణానికి చెందిన ఎండీ రెహమాన్ బాబా పానగల్లు బైపాస్ వద్ద సోమవారం సాయంత్రం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సాక్షి యూనిట్ కార్యాలయంలో పనిచేస్తున్న గౌరు మల్లేష్‌కు ఆ సెల్‌ఫోన్ దొరకడంతో ట్రాఫిక్ పోలీసులకు అప్పగించాడు. సెల్‌ఫోన్‌లో ఉన్న విజిటింగ్ కార్డు ఆధారంగా రెహమాన్ బాబాను గుర్తించి ట్రాఫిక్ సీఐ శ్రీను అతడికి సెల్‌ఫోన్ అందజేశారు.

సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రికి సతీవియోగం



వరలక్ష్మీదేవి (ఫైల్)

మఠంపల్లి : మఠంపల్లికి చెందిన బ్రహ్మశ్రీ సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రి సతీమణి వరలక్ష్మీదేవి (78) సోమవారం తన స్వగృహంలో కన్నుమూశారు. లక్ష్మీనరసింహశాస్త్రి ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో భక్త రామదాసు పుట్టిన ఇంట్లో జన్మించారు. సుమారు ఆరు దశాబ్దాల క్రితం ఆయన మఠంపల్లికి వచ్చి వీవీ హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా ఉద్యోగం చేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. లక్ష్మీనరసింహశాస్త్రి భద్రాచలం, మట్టపల్లి దేవాలయాల్లో నిర్వహించే కల్యాణాలకు ఆలిండియా రేడియో, దూరదర్శన్‌లలో ప్రత్యక్ష వ్యాఖ్యాతగా వ్యవహరించి కీర్తి గడించారు. వరలక్ష్మీదేవి కూడా శ్రీకనకదుర్గ దేవాలయంలో పురోహితురాలిగా తన కుమారుడు, భర్తతో కలిసి పనిచేస్తున్నారు. వరలక్ష్మీదేవి మృతి పట్ల ఎంపీపీ పార్వతీకొండానాయక్, సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సైదమ్మ, ఉప సర్పంచ్ జాల కిరణ్, గ్రంథాలయ చైర్మన్ బీవీ రామారావు, మన్నెం శేషిరెడ్డి, గాయం రామచంద్రారెడ్డి, భోనగిరి ప్రకాష్‌బాబు, కండె వెంకన్న, సురేష్‌గౌడ్, రవీందర్ తదితరులు నివాళులర్పించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

పెద్దఅడిశర్లపల్లి: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని పోల్కంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గుడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన కాటేపాక సైదులు(33) బతుకుదెరువు నిమిత్తం పోల్కంపల్లి గ్రామానికి వలస వచ్చి ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం పోల్కంపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైదులు చనిపోయాడని అతడి అన్న వెంకటయ్యకు ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో వెంకటయ్య తన బంధువులతో కలిసి పోల్కంపల్లికి వచ్చి సైదులు మృతదేహాన్ని పరిశీలించగా చెవుల కింద, మెడపై గాయాలు కనిపించాయి. తన సోదరుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

మృతదేహంపై పచ్చబొట్లు గుర్తింపు

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామ వారులోని ఓ వెంచర్‌లో ఆదివారం లభ్యమైన సగం కాలిన వ్యక్తి మృతదేహానికి సోమవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి ఎడమ చేతిపై కావ్య అని, కుడి చేతిపై వృత్తాకారం మధ్యలో అమ్మ అని, కుడి భుజంపై సూర్యుని ఆకారంలో ఓం అనే పచ్చబొట్లు ఉన్నట్లు గుర్తించినట్లు నార్కట్‌పల్లి పోలీసులు తెలిపారు. ఈ గుర్తులు కలిగిన వ్యక్తి వివరాలు తెలిసిన వారు 9440795635, 9440795610 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆధునిక సమాజానికి మ్యాథమెటిక్స్ కీలకం

- ఎంజీయూ రిజిస్ట్రార్ కృష్ణారావు



సెమినార్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణారావు తదితరులు

ఎంజీయూ(నల్లగొండ రూరల్): ఆధునిక సమాజానికి మ్యాథమెటిక్స్ కీలకంగా మారిందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కృష్ణారావు అన్నారు. ఈ నెల 28న యూనివర్సిటీలో 'రీసెంట్ టెక్నిక్స్ ఇన్ మ్యాథమెటికల్ అప్లికేషన్స్' అనే అంశంపై నిర్వహించనున్న సెమినార్‌కు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధి కల్పనలో గణితం పాత్ర కీలకమన్నారు. శ్రీనివాస రామానుజన్ జన్మదినం సందర్భంగా నిర్వహించే వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హైమావతి, ఉపేందర్‌రెడ్డి, మద్దిలేటి రవి, అంజిరెడ్డి, ప్రేమ్‌సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'పెద్దగట్టు' దిష్టిపూజ

- భారీగా తరలివచ్చిన భక్తులు
- కేసారం చేరిన దేవరపెట్టె



ఆలయానికి వస్తున్న భక్తులు

చివ్వెంల(సూర్యాపేట): తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీలింగమంతులస్వామి (పెద్దగట్టు) జాతర దిష్టిపూజ మహోత్సవం సోమవారం ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత గట్టుకు చేరుకున్న దేవర పెట్టెలోని దేవతావిగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మెంతబోయిన, మున్న వంశస్తులు తమ వెంట తీసుకొచ్చిన తల్లి, పిల్ల గొర్రె పిల్లను బలిచ్చి బలిహరణ నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున తల్లి పిల్ల మాంసంతో వండిన వంటను భక్తులకు వండించారు. అనంతరం దేవర పెట్టె ముందు పసుపుతో వేసిన ముగ్గును మున్న, మెంతబోయిన వంశస్తులు గోర్లవారితో కలిసి ఒక్కరాశిగా చేర్చి దానిని ఆలయం ముందుభాగంలో ఉన్న పుట్టలో పోశారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దేవరపెట్టెను సాయంత్రం యాదవులు భుజాలపై ఎత్తుకుని తిరిగి కేసారం గ్రామ తరలించి అక్కడ మెంతబోయిన వారి ఇంట్లో ఉంచారు. 15 రోజుల పాటు అక్కడే ఉంచి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి పౌర్ణమి రోజు పెద్దగట్టుకు తీసుకొస్తారు. ఈ కార్యక్రమంలో పెద్దగట్టు దేవస్థాన కమిటీ చైర్మన్ కోడి సైదులు యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, తండు శ్రీనివాస్ యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్, పూర రామ్మూర్తి యాదవ్, డైరెక్టర్లు జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, కాస శ్రీనివాస్, మొండికత్తి దుర్గమ్మ, జానయ్య, మెంతబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



దేవర పెట్టెవద్ద పూజలు నిర్వహిస్తున్న యాదవులు

రథ సప్తమికి వేడుకలకు సిద్ధం



సిద్ధమవుతున్న సూర్యప్రభ వాహనం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 28న రథ సప్తమి వేడుకలు నిర్వహించేందుకు సూర్యప్రభ వాహనాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి సూర్యప్రభ వాహనంపై ఆగమశాస్త్ర రీతిలో ఊరేగింపు చేపట్టనున్నట్లు ఆచార్యులు వెల్లడించారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

నల్లగొండ క్రైం: మూగ వ్యక్తుల్లా నటిస్తూ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను నల్లగొండ టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన యేసు అలియాస్ దర్విడ్ నల్లగొండ పట్టణంలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యేసుతో పాటు పట్టణంలోని కామేశ్వర్‌రావు కాలనీకి చెందిన చింత యాదగిరి మూగ వారిగా నటిస్తూ ఏదైనా సాయం చేయమని ఇంటింటికి తిరుగుతుండే వారు. ఇంటి యజమానులు ఏదైనా సాయం చేద్దామని ఇంట్లోకి వెళ్లగానే వీరు సెల్‌ఫోన్‌లు, నగదు, విలువైన వస్తువులు చోరీ చేసి పరారయ్యే వారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో నివాసముంటున్న చింత సుధీర్ ఇంటికి వెళ్లిన దొంగలిద్దరూ రెండు సెల్‌ఫోన్‌లు చోరీ చేశారు. చోరీ చేసిన సెల్‌ఫోన్‌లను సోమవారం రామగిరిలో అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా అప్పటికే అందిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒకే గదిలో ఐదు తరగతులు



వంట గదిలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు పాఠాలు చెబుతున్న టీచర్లు



తరగతి గదిలో కంటి వెలుగు పరీక్షలు చేస్తున్న డాక్టర్

భువనగిరి పట్టణంలోని మాస్‌కుంట ప్రాథమిక పాఠశాలలో మొత్తం మూడు తరగతి గదులు ఉండగా రెండు గదుల్లో అధికారులు కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేశారు. దీంతో సోమవారం పాఠశాలలోని చిన్న వంట గదిలో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు టీచర్లు పాఠాలు చెబుతూ కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి జిల్లా